
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 16 । సెప్టెంబర్ । 2024



సోమశిలలో 49.819 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 49.819 టీఎంసీలు ఉన్నాయి. 14,050 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంటే.. 10,050 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.75,780
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,865
3శాతం జీఎస్టీతో	రూ.7,071
నవర (8 గ్రా)	రూ.56,568

గరిష్ఠం/కనిష్ఠం
38.1 /27.4

వాతావరణం

జిల్లాలో సోమవారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉంటాయి.గాలిలో తేమ 41 శాతం ఉంది.



కొత్త మెడికల్ కళాశాలలతో మరింత మంది డాక్టర్లు

గత ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేసింది. ఈ సంవత్సరం ఐదు, వచ్చే సంవత్సరం మరో 7 కళాశాలలు ప్రారంభం కావాల్సి ఉంది. ఇవి ప్రారంభమైతే అదనంగా దాదాపు 2 వేల మందికి వైద్య విద్యలో సీట్లు వస్తాయి. పేద విద్యార్థుల డాక్టర్ కల నెరవేరుతోంది. గత ప్రభుత్వం సిద్ధం చేసిన మెడికల్ కళాశాలల్లో యుద్ధప్రాతిపదికన సీట్లు భర్తీకి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మెడికల్ కళాశాలలు కొనసాగించాలి.

– గంగపట్నం సుగుణషైని, మెడికల్ స్టూడెంట్, ఏసీఎస్ఆర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల



ప్రైవేట్ పరం చేయడం దారుణం



రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు మెడికల్ కళాశాలలను అప్పగించేందుకు నిర్ణయం తీసుకోవడం సరికాదు. నూతన మెడికల్ కళాశాలలకు ప్రోత్సాహమిచ్చి త్వరితగతిన వాటికి వసతుల కల్పనలో సహకరించి రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్లు పెంచేందుకు అవకాశం ఉండగా, ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయకపోవడం విద్యార్థులకు అశనిపాతం లాంటిదే. మా అమ్మాయి హితీషా నీట్ పరీక్ష రాసి 470 మార్కులు సాధించింది. రాష్ట్రంలో సీట్లు ఎక్కువ ఉంటే అవకాశం వస్తుందనే ఆశతో ఉన్నాం. ఇంతలో ప్రభుత్వం నిర్మాణాల్లో ఉన్న కళాశాలల్లో పనులు నిలిపివేయడం విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లినట్లే అయింది.

– దొర్నాదుల లక్ష్మణ, విద్యార్థి తండ్రి, ఆత్మకూరు

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

నెల్లూరు(దర్గామిట్ట): మిలాద్ ఉన్ నబీ పండగ సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ ఓ ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు గమనించాలని కోరారు.

పోలీస్ శాఖలోనూ..

నెల్లూరు సిటీ: సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' రద్దు చేసినట్లు ఎస్పీ కార్యాలయం ఆదివారం ప్రకటనలో తెలిపారు.

పలువురి డీఎస్పీల బదిలీలు



కావలి డీఎస్పీగా బదిలీ అయిన పీ శ్రీధర్

నెల్లూరు సిటీ/కావలి/కందుకూరు: జిల్లాలో కావలి, కందుకూరు, డీపీటీసీ డీఎస్పీలను బదిలీ చేస్తూ.. కొత్తగా నియమిస్తూ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా కావలి డీఎస్పీగా పనిచేస్తున్న వెంకటరమణ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ కాగా అయన స్థానంలో డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న పీ శ్రీధర్‌ను నియమించారు. బదిలీ అయిన ఎం.వెంకటరమణ 2022 నవంబర్‌లో కావలి డీఎస్పీగా విధుల్లో చేరారు. డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న ఎం.గిరిధర్‌రావుని జిల్లా పోలీస్ ట్రైనింగ్ కళాశాల (డీపీటీసీ) డీఎస్పీగా నియమించారు. కందుకూరు డీఎస్పీ ఎ. శ్రీనివాసరావును గుంతకల్ డీఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎవరిని నియమించలేదు. ఎన్నికల నేపథ్యంలో శ్రీనివాసరావు కందుకూరు డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు.

ఇంజినీర్ల ఘనతను చాటిన మోక్షగుండం

నెల్లూరు(అర్బన్): భారత ఇంజినీర్ల ఘనతను ప్రపంచానికి చాటి చెప్పిన ఇంజినీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని పంచాయతీరాజ్ ఎస్ఈ పి.అశోక్‌కుమార్ అన్నారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం దర్గామిట్టలోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయం ఆవరణలో ఇంజినీరింగ్ డే ఘనంగా నిర్వహించారు. విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సుబ్బరాజు, రవీంద్రబాబు, వేణుగోపాల్, డిప్లొమా ఇంజినీర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రియాజ్‌అహ్మద్, పీఆర్ జేఏసీ చైర్మన్ బాబురావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత రోడ్ల నిర్మాణంలో పీఆర్ ఇంజినీర్లదే కీలక పాత్ర అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్లు జేవీ శ్రీధర్, పరమేశలింగం, సుధాకర్, వాసు, ఖాదర్‌మస్తాన్, రఫీ, యాకూబ్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, విజయకుమార్, జిల్లాలోని ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాల్లో అపశ్రుతి

- టపాసులు పేలి 10 మందికి గాయాలు
- కొందరి పరిస్థితి విషమం



ఊడిపోయిన ప్రహరీ గేటు, ధ్వంసమైన బైక్

మనుబోలు: మనుబోలులో ఆదివారం రాత్రి జరిగిన గణేష్ ఉత్సవాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. వినాయక ఉత్సవాల్లో భాగంగా బీసీ కాలనీలో చివరి రోజు గణేష్ గ్రామోత్సవానికి సిద్ధం చేస్తుండగా ఒక్కసారిగా పెద్ద శబ్దంతో టపాసులు పేలాయి. వినాయక మండపం పక్కనే ఉన్న ఓ ఇంటి ముందు ఉత్సవం కోసం తెచ్చిన టపాసులు ఉంచారు. ఉత్సవం ప్రారంభం అవుతుండగా టపాసులు పేలుస్తున్నారు. ఇంతలో ఏమి జరిగిందో గాని ఒక్కసారిగా భారీ విస్ఫోటనంతో టపాసులు పేలిపోవడంతో జనం భయంతో పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో 10 మందికి పైగా గాయాలయ్యా యి. పెరుమాళ్ల ఓబయ్య, కావేటి పెంచలయ్య, మునయ్య, శివయ్య, మౌనిక, యామిని, నిర్మలమ్మ, కంద్రాతి గౌతమి, రాజేశ్వరి, గీష్మ, సిద్ధూ, నాగరాజు, గిరీష్, లోకేష్‌తో పాటు మరి కొందరికి గాయాలయ్యాయి. పేలుడు తీవ్రతధాటికి ఇంటి డోరు ఊడిపోగా, ప్రహరీ గేటు విరిగి దూరం పడిపోయింది. చుట్టుపక్కల ఇళ్ల అద్దాలు సైతం పగిలిపోయాయి. క్షతగాత్రుల హాహాకారాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. సమాచారం అందుకున్న పోలీసులు, 108 సిబ్బంది అక్కడికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గూడూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




క్షతగాత్రులు

తోడేయ్.. దోచేయ్..

- పూడికతీత పేరుతో పెన్నా ఇసుకను పంచేసుకున్నారు
- నెల్లూరు, సంగం, సూరాయపాళెం వద్ద డీసిల్టేషన్‌తో ఇసుక రవాణాకు అనుమతి
- పేరుకే టెండర్ల ప్రక్రియ.. అంతా ముగ్గురు ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే..
- నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో తవ్వకాలు
- రూ.100 కోట్ల విలువైన ఇసుక దోపిడీకి వ్యూహం
- నేరుగా పెన్నా నదిలోకే రహదారి ఏర్పాటు
- ఇసుక వాహనాలను రాత్రి వేళల్లో జిల్లా సరిహద్దులు దాటించేస్తున్నారు
- టెండర్లు వేసిన బోట్ల యజమానులకు పచ్చనేతల బెదిరింపులు

సంగం బ్యారేజీకి అత్యంత సమీపంలోనే పెన్నానదిలో డ్రెడ్జింగ్ ద్వారా ఇసుక తోడేస్తున్న దృశ్యం



జిల్లాలో ఇసుక కొరతతో నిర్మాణాలు నిలిచిపోయాయి. కూలీలు పనులు దొరక్క ఆకలి కేకలేస్తున్నారు. కానీ టీడీపీ ఎమ్మెల్యేలు మాత్రం ఇసుక కొరత తీర్చడం కంటే.. ఇసుక ద్వారా రూ.వందల కోట్లు కొల్లగొట్టడమే వ్యూహంగా ప్రణాళికలు రచించుకున్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలను తుంగలో తొక్కి యంత్రాలతో తవ్వకాలు చేపట్టి బయటకు తరలిస్తున్నారు. డ్రెడ్జింగ్ ద్వారా తోడిన ఇసుకను బయటకు రవాణాకు చేసేందుకు ఏకంగా ప్రభుత్వ ఖర్చులతో పటిష్టమైన రహదారులను ఏర్పాటు చేశారు. ఇది కూడా ఎన్‌జీటీ నిబంధనలకు విరుద్ధమే. డ్రెడ్జింగ్ ద్వారా తోడిన ఇసుకకు కూడా లెక్కాపక్కా లేదు. రీచ్‌ల నుంచి బయట తెచ్చిన ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: పెన్నానదిని అధికార పార్టీ ఎమ్మెల్యేలు పాయలు పాయలుగా పంచుకున్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతి లేకుండానే డ్రెడ్జింగ్ విధానంలో ఇసుక తవ్వే ప్రక్రియకు తెరతీశారు. జిల్లా కలెక్టర్‌తో పాటు గనులు, భూగర్భ శాఖ అధికారులతో అధికారికంగా టెండర్ల ద్వారా డ్రెడ్జింగ్ కాంట్రాక్ట్ ఖరారు చేయించారు. పెన్నానదిలో తోడిన ఇసుకను బయటకు రవాణా చేసేందుకు ఏకంగా పటిష్టమైన రోడ్లను ఏర్పాటు చేశారు. ఎన్‌జీటీ నిబంధనలకు విరుద్ధంగా పెన్నానదిలోకి రోడ్లు వేశారు. బయటకు తీసిన ఇసుకకు లెక్కాపత్రం కూడా లేదని తెలుస్తోంది. ఇటీవల సరాయపాళెం రీచ్‌లో డ్రెడ్జింగ్ కాంట్రాక్ట్ దక్కించుకున్న గుంటూరుకు చెందిన శ్రీకృష్ణ శాండ్ అండ్ ఫెర్రీ బోర్డ్ వర్కర్స్ అండ్ అదర్ వర్క్స్ లేబర్ కాంట్రాక్ట్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ప్రతినిధులను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి ముఖ్య అనుచరుడు బెదిరించిన వీడియో వైరల్ అయింది. దీన్ని బట్టి ఇసుక దోపిడీకి ఏ స్థాయిలో స్కెచ్ వేశారో అర్థమవుతోంది.

పర్యావరణ అనుమతులు లేక నిలిచిపోయిన తవ్వకాలు

జిల్లాలో ఇసుక రీచ్‌లకు పర్యావరణ అనుమతులు లేకపోవడంతో ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. జూలై 8వ తేదీ ప్రకటించిన ప్రకారం జిల్లాలోని మూడు స్టాక్ యార్డుల్లో 1,75,301 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉండింది. మర్రిపాడు 1,25,211 మెట్రిక్ టన్నులు, మినగల్లులో 41,885 మెట్రిక్ టన్నులు, పల్లిపాడులో 8,205 మెట్రిక్ టన్నులు ఉండగా నెల రోజుల్లోనే మినగల్లు, పల్లిపాడు స్టాక్ యార్డుల్లో ఇసుక ఖాళీ అయిపోయింది. మర్రిపాడులో కూడా ఇటీవలే దాదాపు ఖాళీ అయిపోయింది. గతంలో స్టాక్ యార్డుల్లోని ఇసుకను సైతం టీడీపీ నేతలు కాజేసిన విషయం తెలిసిందే. అధికారికంగా ఒక పక్క విక్రయాలు చేస్తుంటే.. మరో పక్క అక్రమంగా తరలించిన వైనం బయటపడింది. తవ్వకాలు లేకపోవడంతో స్టాక్ యార్డుల్లో ఇసుక కొరత కారణంగా జిల్లాలో నిర్మాణాలు నిలిచిపోయాయి.

ఇసుక లేకపోయినా.. విచ్చలవిడిగా అక్రమ రవాణా

జిల్లాలో స్టాక్ యార్డుల్లో ఇసుక నిల్వలు లేవు. కొత్తగా రీచ్‌లకు పర్యావరణ అనుమతులు లేవు. అయినప్పటికీ జిల్లా నుంచి పక్క జిల్లాతో పాటు రాష్ట్రాలకు రోజుకు వందల లారీలు ఇసుక అక్రమ రవాణా విచ్చలవిడిగా జరుగుతోంది. దీన్ని బట్టి టీడీపీ నేతలు ఎక్కడిక్కడ ఇసుక రీచ్‌ల నుంచి అనధికారికంగా తోడేస్తున్నారని అర్థమవుతోంది.



డ్రెడ్జింగ్ ద్వారా నదిలో నుంచి తీసిన ఇసుకను ట్రాక్టర్‌లోకి లోడ్ చేస్తున్న దృశ్యం



రీచ్‌లో ఇసుకను పడవల్లోకి తోడుతున్న సిబ్బంది



సంగంలో హైవేకు ఆనుకుని ప్రధాన రహదారి వెంబడి ఉన్న ఇసుక స్టాక్ పాయింట్



రీచ్‌లో ఇసుకను తవ్వి గుట్టలుగా పోస్తున్న పొక్లయిన్

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా..

పెన్నానదిలో పూడిక తీత ప్రక్రియలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు పాతరేశారు. నిబంధనల ప్రకారం అయితే యంత్రాలు లేకుండా బోర్డ్స్ మ్యాన్ సొసైటీ ద్వారా పడవలతో మధ్యలో ఉన్న పూడికను యంత్రాలతో కాకుండా సంప్రదాయ పనిముట్ల ద్వారా మీటరు లోతులో మాత్రమే తవ్వాల్సి ఉంది. అయితే ఇందుకు విరుద్ధంగా ఏకంగా 10 మీటర్లకు పైగా లోతులో ఇసుకను యంత్రాల ద్వారా తోడేసి తరలిస్తున్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ విధివిధానాలకు వ్యతిరేకంగా డీసీల్టింగ్ అనే పదాన్ని వాడుకుంటూ మెషిన్ల ద్వారా విచ్చలవిడిగా డ్రెడ్జింగ్ నిర్వహిస్తూ, అక్రమంగా ఇసుకను తరలిస్తున్నా.. మైనింగ్, నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారు. భవిష్యత్‌లో సంగం బ్యారేజీకు పెను ప్రమాదం ఏర్పడనుందని గతంలోనే ఎన్‌జీటీ సూరాయపాళెం వద్ద రీచ్‌కు అనుమతులు నిరాకరించింది. అయితే ఎన్‌జీటీ నిబంధనలకు విరుద్ధంగా సూరాయపాళెంలో ఇసుక తవ్వకాలు చేపడుతుండడంతో సంగం బ్యారేజీకి ప్రమాద ముప్పు ఏర్పడుతుందని ఇంజినీర్లు, నిపుణులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

రాత్రి వేళల్లో ఇసుక తరలింపు

రాత్రి వేళల్లో పెన్నానది నుంచే ఇసుక అక్రమ రవాణా చేసేందుకు నాయకులు పక్కా ప్లానింగ్ చేసుకున్నారు. ఎలాంటి అనుమతుల్లేకుండా ఇతర జిల్లాలకు ఎక్కువ ఇసుక తరలిస్తున్నారు. నెలవారీ మామూళ్లతో పోలీస్, మైనింగ్, ఆర్టీఓ తదితర అధికారులు పట్టించుకోవడంలేదు. పెన్నా నుంచి ఇసుకను నెల్లూరుకు తరలించే ఏడు యూనిట్ల వాహనానికి రూ.30 వేలు వసూలు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు పంపితే రూ. 1.2 లక్షల వరకు వసూలు చేస్తున్నారు.

కలెక్టర్ ఆదేశాలకు చెక్

కలెక్టర్ ఆదేశాలు ఇచ్చిన వెంటనే ప్రజాప్రతినిధులు గరంగరం అయ్యారు. ఏ నియోజకవర్గ పరిధిలో ఆ లోకల్ ఎమ్మెల్యే సూచించిన వారికే ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో కలెక్టర్ సైతం మారుమాట మాట్లాడకుండా ఎమ్మెల్యేల ఇష్టానుసారం చేసుకొమ్మని అనధికార ఆదేశాలిచ్చారు. నెల్లూరు బ్యారేజీ వద్ద కోవూరు ఎమ్మెల్యే సమీప బంధువుకు, సంగం వద్ద మంత్రి ఆనం కోటరీకి చెందిన వ్యక్తికి, పొదలకూరు మండలంలో సోమిరెడ్డి తన అనుచరుడి ద్వారా ఇసుక రవాణా బాధ్యతలు అప్పగించారు. వాస్తవానికి ఇసుక డ్రెడ్జింగ్‌కు గుంటూరు జిల్లాకు చెందిన శ్రీకృష్ణా శాండ్ అండ్ ఫెర్రిబోర్డు వర్కర్స్ అండ్ అదర్ వర్క్స్ లేబర్ కాంట్రాక్ట్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌కు బోటు ద్వారా ఇసుక రవాణా చేసే అనుమతులు ఇచ్చారు. దీనికి స్థానిక ఎమ్మెల్యేలు ససేమిరా అన్నారు. బోటు ఇచ్చి మీరు వెళ్లిపోవాలని బెదిరింపులకు దిగారు. నేరుగా ఇసుక రీచ్‌ల్లోకి వాహనాలు వెళ్లేందుకు రహదారులు నిర్మించారు. బోటు ద్వారా ఇసుక రవాణా చేస్తున్నట్లు చూపించి నేరుగా పెన్నానది నుంచే ఇసుకను తరలించేందుకు పక్కా ప్లానింగ్ చేసుకున్నారు.



పూడికతీత పేరుతో ఇసుక దోపిడీ

ఇసుక తవ్వకాలకు అనుమతి లేకపోవడంతో టీడీపీ నేతలు కొత్త స్కెచ్ వేశారు. పెన్నానదిలో పూడిక తీత పేరుతో డ్రెడ్జింగ్‌తో ఇసుక తవ్వకాలకు ప్లాన్ చేశారు. నదిలో పూడికతీత పేరుతో మూడు చోట్ల అనుమతులు తెప్పించి స్థానిక ఎమ్మెల్యేలే ఒక్కో పాయింట్‌ను ఒక్కొక్కరికి అప్పగించి తద్వారా రూ.100 కోట్ల విలువైన ఇసుక దోపిడీకి వ్యూహం పన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నేతలు వాగులు, వంకలు, పెన్నానదిలో చాటు మాటున తెచ్చి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తరుణంలో పెన్నానదిలో డీసిల్టేషన్‌తో ఇసుక దోపిడీకి ముగ్గురు ప్రజాప్రతినిధులు తెరచాటు రాజకీయం చేసి ఇరిగేషన్ అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. నెల్లూరు, సంగం, సూరాయపాళెం వద్ద పెన్నానదిలో డ్రెడ్జింగ్ ద్వారా డీసిల్టేషన్ చేసి ఇసుకను స్టాక్ పాయింట్ వద్దకు రవాణా చేసేలా పథకం రచించారు. దీనికి ఎంప్యానల్ కమిటీ ఆమోదంతో గత నెల 23న పత్రికా ప్రకటన ద్వారా ఇసుక డీసిల్టింగ్‌కు టెండర్లకు ఆహ్వానించారు. అదే నెల 27న టెండర్లు ఓపెన్ చేశారు. మొత్తం 16 మంది అర్హత సాధించగా అందరిని కలిసి చేసుకోమని కలెక్టర్ ఆదేశించారు.



ట్రాక్టర్లు వెళ్లేందుకు నదిలో ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు



రీచ్‌కు సమీపంలో స్టాక్ పాయింట్ వద్ద ఇసుకను తరలించేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

నదిలో రోడ్డుకు అనుమతి ఇవ్వలేదు

సూరాయపాళెం నుంచి పెన్నా నదిలోకి వెళ్లేందుకు రహదారి ఏర్పాటుకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. కొందరు ప్రైవేట్ వ్యక్తులు గ్రావెల్ తోలి రహదారి ఏర్పాటు చేసుకున్నారు. ఇసుక విధివిధానాలు గురించి మాకేమీ తెలియదు.

– రవికుమార్, ఇరిగేషన్ ఏఈ, పొదలకూరు

కావలి ఎమ్మెల్యే ఏకపక్ష వైఖరిపై యుద్ధం చేస్తా

- కావ్య వైఖరితో పార్టీకి తీవ్ర నష్టం
- చంద్రబాబు, లోకేశ్‌కు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు విజ్ఞప్తి



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాలేపాటి సుబ్బానాయుడు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'కావలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఏకపక్ష వైఖరితో పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోంది. ఎమ్మెల్యే వైఖరిపై ఇకనుంచి ప్రత్యక్ష యుద్ధానికి నేను సిద్ధంగా ఉన్నాను. టీడీపీ నీది కాదని నన్ను అనే దమ్ము, ధైర్యం ఎవరికీ లేదు. టీడీపీ కోసం పని చేస్తే నాపై 16 కేసులు పెట్టించారు. ఇప్పుడు కొత్తగా నాపై వంద కేసులు పెట్టినా, జైల్లో పెట్టినా భయపడను. అన్నింటికీ సిద్ధంగా ఉన్నాను. ఎన్నికల సందర్భంగా చెప్పిన మాట తప్పి, ఏకపక్షంగా వ్యవహరిస్తున్న ఘోరాలపై పార్టీ అధిష్టానం విచారణ కమిటీ నియమించి నిజాలను గుర్తించాలి' అని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. ఆదివారం తన నివాసంలో కార్యకర్తలతో చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే అవలంబిస్తున్న వివాదాస్పదమైన, ఘర్షణ పూరిత విధానాలపై ధ్వజమెత్తారు. చంద్రబాబునాయుడిని అరెస్ట్ చేసి జైల్లో పెడితే వీధుల్లో టాపాసులు కాల్చి సంబరాలు చేస్తున్న వ్యక్తులు ఈ రోజు టీడీపీలో పెత్తనం చేస్తున్నారని, ఇంతకన్నా దౌర్భాగ్యం ఏమిటని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడినే అడుగుతున్నా.. అసలు టీడీపీ ఎటు పోతోంది? ఏమి జరుగుతుంది? కడుపు రగిలిపోతుంది. పార్టీ ఏమవుతోందో అర్థం కావడం లేదన్నారు. నీతి నిజాయతీతో రాజకీయాలు చేయాలే కాని, లాలూచీ రాజకీయాలు చేస్తే ఊరుకోను. కావలిలో టీడీపీకి ఏమీ లేదు అనే రోజుల్లో పార్టీ ఆఫీస్‌ను ఏర్పాటు చేశానన్నారు. టీడీపీ కోసం రూ.17 కోట్లు ఖర్చు పెట్టానన్నారు. పార్టీ కార్యక్రమాలు, ఆందోళనలు నుంచి చంద్రబాబు సభలు, లోకేశ్ యువగళం ఆరు రోజుల పాదయాత్రను విజయవంతంగా నిర్వహించడంలో తాను ఎంతో కష్టపడ్డానన్నారు. దుగ్గిరాల కరుణాకర్ అనే యువకుడు చనిపోతే రూ.20 లక్షలు టీడీపీ తరఫున అతని కుటుంబ సభ్యులకు తాను సహాయం అందజేశానన్నారు. నోరుందని నిందలు వేసి పిచ్చిపిచ్చిగా మాట్లాడడం కాదని, నిరూపించాలని సవాల్ విసిరారు. టీడీపీలోకి రకరకాల వ్యక్తులు వస్తుంటారు, పోతుంటారు. కానీ తాను మాత్రం టీడీపీనే అన్నారు. ఇక నుంచి టీడీపీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉండేందుకు క్రియాశీలకంగా ఉంటానన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బుచ్చిరెడ్డిపాళెం– దగదర్తి రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తే.. ఇప్పుడు మళ్లీ రెండోసారి శంకుస్థాపన అంటూ హడావుడిగా చేస్తున్నారంటూ ఎద్దేవా చేశారు.

అత్యధిక రాబడిలో నెల్లూరు రైల్వేస్టేషన్‌కు 7వ స్థానం



కావలి: రాష్ట్రంలో రైల్వే శాఖకు 2023–24 సంవత్సరంలో అత్యధిక రాబడి సాధించిన టాప్ 30 రైల్వేస్టేషన్లలో నెల్లూరు 7వ స్థానంలో నిలిచింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నెల్లూరుకు 7వ స్థానం దక్కితే, గూడూరు రైల్వే స్టేషన్లకు 13వ స్థానం దక్కింది. ఏడాది కాలంలో రైల్వేస్టేషన్ ద్వారా రిజర్వేషన్, అన్ రిజర్వేషన్ టికెట్లు కొనుగోలు చేయడంతో రైల్వే శాఖకు వచ్చిన రాబడి, ఆ ఏడాదిలో ఆ రైల్వేస్టేషన్ ద్వారా ప్రయాణించిన ప్రయాణికుల సంఖ్య తదితర అంశాలను ప్రాతిపదికగా రైల్వే శాఖ ప్రతి రైల్వేస్టేషన్‌ను కేటగిరీల వారీగా విభజిస్తోంది. నెల్లూరు రైల్వేస్టేషన్ 7వ స్థానంలో నిలిచి నాన్ సబర్బన్ గ్రేడ్ (ఎన్ఎస్‌జీ)–3 దక్కించుకుంది. రిజర్వేషన్ టికెట్ల ద్వారా 73,55,70,705 మంది ప్రయాణికులు, సాధారణ టికెట్ల ద్వారా 23,87,06,996 మంది ప్రయాణికులు, మొత్తం 97,42,77,701 మంది నెల్లూరు రైల్వేస్టేషన్ ద్వారా ప్రయాణం చేశారు. గూడూరు రైల్వే స్టేషన్‌కు 13వ స్థానం దక్కితే నాన్ సబర్బన్ గ్రేడ్ –3ని నిలుపుకుంది. రిజర్వేషన్ టికెట్ల ద్వారా 26,96,91,711 మంది, సాధారణ టికెట్లతో 18,27,69,455 మంది, మొత్తం 45,24,61,166 మంది గూడూరు రైల్వే స్టేషన్ ద్వారా ప్రయాణించారు. ఏడాదిలో ప్రయాణికుల టికెట్ కొనుగోలు ద్వారా రూ.20 కోట్ల నుంచి రూ.100 కోట్ల రాబడిని ఆర్జించిన రైల్వేస్టేషన్‌ను రైల్వేశాఖ ఎన్ఎస్‌జీ–3 స్థానంగా పరిగణిస్తోంది. రాష్ట్రంలో విశాఖపట్టణం, విజయవాడ రైల్వేస్టేషన్లకు మాత్రమే నాన్ సబర్బన్ గ్రేడ్–1 లభించింది. ఏడాదిలో రూ.500 కోట్లకు పైన రాబడి ఆర్జించడంతో వాటికి ఈ ఘనత దక్కింది. తిరుపతి, రాజమండ్రి, రేణిగుంట, గుంటూరు రైల్వేస్టేషన్లు నాన్ సబర్బన్ గ్రేడ్–2 స్థానాన్ని దక్కించుకున్నాయి. ఇవి రూ.100 కోట్ల నుంచి రూ.500 కోట్లు రాబడిని ఆర్జించాయి.

రెడ్ కార్పెట్ తొలగింపు

నెల్లూరు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు జిల్లాలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖలోని 15 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్ పోడియం ముందు ఉండే రెడ్ కార్పెట్‌ను ఆదివారం తొలగించారు. దశాబ్దాలుగా ఈ విధానాన్ని తొలగిస్తూ ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

క్లుప్తంగా

టీడీపీ నాయకుల పైశాచికత్వం

- వైఎస్సార్‌సీపీ నాయకుడు, అతని కుమారులపై దాడి

కందుకూరు రూరల్: కల్వర్టు ధ్వంసం చేయడంపై ప్రశ్నించినందుకు వైఎస్సార్‌సీపీ నాయకుడు, అతని కుమారులపై టీడీపీ వారు దాడి చేసిన ఘటన మండలంలోని ఓగూరు పంచాయతీ ఆది ఆంధ్రా కాలనీలో ఆదివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కాలనీలోకి వెళ్లే కల్వర్టును టీడీపీకి చెందిన కొందరు కూల్చేసిన విషయం తెలిసిందే. దీనిపై కాలనీలోని వైఎస్సార్‌సీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఆదివారం కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు రాయపాటి శ్రీనివాసులు, ఆయన అనుచరులు పాలిపోగు వాసు, రాయపాటి పుల్లయ్య, బాణాల సాల్మాన్, పాలిపోగు రాఘవులు, రాయపాటి బాల వెంకటేష్, పాలిపోగు మహేష్‌లు వైఎస్సార్‌సీపీ నాయకుడు కరేటి చిన కోటేశ్వరరావు ఇంటి వద్దకు వచ్చి దాడికి పాల్పడారు. తండ్రిపై దాడి చేస్తుండడాన్ని గమనించిన కుమారులు అభినయ్, అక్షయ్ కుమార్‌లు తప్పించే ప్రయత్నం చేశారు. దీంతో వారిపై కూడా టీడీపీ నాయకులు దాడి చేసి గాయపరిచారు. చిన కోటేశ్వరరావుకు ముక్కులో నుంచి రక్తం వచ్చింది. పెదవి లోపల భాగంలో, అభినయ్‌కి చెవి వద్ద గాయమైంది. అక్షయ్ కుమార్‌ను ఇసుకలో పడేసి కొట్టారు. దీంతో వీపుపై గాయమైంది. గొడవను అభినయ్ వీడియో తీస్తుండగా ఫోన్‌ను లాక్కొని తీసుకెళ్లిపోయారు. గ్రామంలోని కొందరు వచ్చి ఆపకపోతే తమను చంపేసేవారని చినకోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు కందుకూరు ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అక్రమ రవాణా చేస్తూ.. ప్రహరీని ఢీకొట్టి..



ఘటనా స్థలంలో ట్రాక్టర్

నెల్లూరు సిటీ: కూటమి ప్రభుత్వంలో టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూరల్ మండలంలోని కలివెలిపాళెం గ్రామం చెరువులో కొందరు టీడీపీ నాయకులు యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. జేసీబీ సాయంతో చెరువులో అక్రమంగా తవ్వించి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. డ్రైవర్లు అతివేగంతో వాహనాలు నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. రోజుకు సుమారు 50 ట్రిప్పులు తరలిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆదివారం ఓ ట్రాక్టర్ మట్టిని తరలిస్తూ కలివెలిపాళెంలో ఓ ఇంటి ప్రహరీ ఢీకొని లోపలికి దూసుకెళ్లింది. ఈ సమయంలో అక్కడెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రోడ్డుపైకి రావాలంటే భయమేస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. అధికార పార్టీ ఒత్తిళ్లే కారణమని తెలుస్తోంది.

ఆటో బోల్తా

- ముగ్గురికి గాయాలు

మనుబోలు: మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఆదివారం ఆటో బోల్తా పడిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. కాగితాలపూరు గ్రామం నుంచి కొందరు మహిళలు ఆటోలో తిరుపతి జిల్లా జరుగుమల్లికి వెళ్తున్నారు. ఆటో పామాయిల్ ఫ్యాక్టరీ సమీపంలో ఉండగా ఓ కారు హఠాత్తుగా ముందుకొచ్చి నెమ్మదవడంతో ఆటో అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న జట్ల కొండూరు గ్రామానికి చెందిన వెంకటరమణమ్మ, కాగితాలపూరు గ్రామానికి చెందిన మారు పద్మమ్మ, మంగమ్మ గాయపడ్డారు. స్థానికులు వారిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం గూడూరుకు తరలించారు.

గంజాయి మత్తులో యువకుడి హల్‌చల్

ఆత్మకూరు: పట్టణంలోని మెయిన్ బజార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట గంజాయి మత్తులో ఓ యువకుడు ఆ మత్తులో ముగ్గురిపై కత్తితో దాడికి పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు, సీఐ గంగాధర్ కథనం మేరకు.. దీక్షిత్ అనే యువకుడు మద్యానికి బానిసయ్యాడు. అప్పుడప్పుడు గంజాయి గంజాయి సైతం సేవించేవాడు. ఆదివారం మధ్యాహ్నం కాంగ్రెస్ పార్టీ ఆవరణలో గంజాయి సేవిస్తున్నాడు. దళితకాలనీకి చెందిన పలువురు అలా చేయొద్దని అతడిని వారించారు. దీనిని మనసులో ఉంచుకున్న దీక్షిత్ రాత్రి 10 గంటల సమయంలో మెయిన్ బజారులో వారిపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. తనను మధ్యాహ్నం గంజాయి సేవించే క్రమంలో ఎందుకు అడ్డుకున్నారంటూ దూషించాడు. ఈ గొడవలో గడ్డం సుబ్బయ్య, కోడూరు నవీన్‌తోపాటు మరో యువకుడికి గాయాలయ్యాయి. ఈ పరిస్థితిని పరిశీలించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. సీఐ గంగాధర్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని దీక్షిత్‌ను అదుపులోకి తీసుకుని గాయపడిన ముగ్గురిని ఆస్పత్రికి తరలించారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయనున్నట్లు సీఐ తెలిపారు.



ప్రతిభ గల విద్యార్థులకు నష్టం

గత ప్రభుత్వం రాష్ట్రంలో మెడికల్ కళాశాలలు మంజూరు చేసింది. కొన్ని నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. ఈ సంవత్సరం అడ్మిషన్లు జరగాల్సి ఉంది. పేద విద్యార్థులు సీట్లు తెచ్చుకుని డాక్టర్ కల సాకారం చేసుకునే వీలుంటుంది. అయితే కొత్త ప్రభుత్వం కళాశాలలను ప్రారంభించకుండా ప్రైవేటీకరించేందుకు పూనుకుంది. ఇదే జరిగితే ప్రతిభ చూపిన పేద విద్యార్థులకు అవకాశాలు దక్కవు. ఫలితంగా డాక్టర్ కల అందని ద్రాక్షగానే మారుతుంది.

– ఎస్‌కే సిరాజ్, ద్వితీయ సంవత్సర ఎంబీబీఎస్ విద్యార్థి, బుజబుజనెల్లూరు



ఇలా చేయడం అన్యాయం



నేను కష్టపడి చదివి మంచి ర్యాంక్‌తో కర్నూలు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించా. ప్రభుత్వ ఆధ్వర్యంలో మెడికల్ సీటు సాధిస్తే కేవలం రూ.10 వేలు మాత్రమే ఫీజు. ప్రైవేట్ రంగంలో వైద్య విద్య అభ్యసించాలంటే సీటును కనీసం రూ.కోటికి పైగా చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తుంది. పేద విద్యార్థులు సీట్లు కొనుగోలు చేయలేరు. గత ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం మంజూరు చేసిన మెడికల్ కళాశాలలను ప్రస్తుత ప్రభుత్వం ప్రైవేటీకరించేందుకు పూనుకోవడం అన్యాయం.

– జి.మునివెంకటసాయి సంహిత, ఎంబీబీఎస్ విద్యార్థిని, నెల్లూరు

పేదల ఆస్పత్రికి పెద్ద జబ్బు

జీజీహెచ్‌లో మందుల కొరత

- రక్తపరీక్షల కొరతతో రోగుల అగచాట్లు
- పనిచేయని లిఫ్ట్.. మెట్లు ఎక్కలేక బాధితుల ఇక్కట్లు
- చోద్యం చూస్తున్న కూటమి ప్రభుత్వం
- రాజకీయాలు చేయడంలో వైద్యారోగ్య శాఖ మంత్రి బిజీ

కూటమి ప్రభుత్వంలో పేదల ఆరోగ్యం గాల్లో దీపంలా మారింది. ప్రభుత్వాస్పత్రులను పట్టించుకునేనాథుడే కరువయ్యాడు. వైద్యారోగ్య శాఖ మంత్రి హాస్పిటళ్లలో వసతులు కల్పించడంలో, రోగుల బాధలను తీర్చడంలో విఫలమయ్యారు. రాజకీయాలు చేయడంలో మాత్రం ముందున్నారు. నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో (పెద్దాస్పత్రి) బోలెడు సమస్యలున్నాయి. మందుల కొరత వేధిస్తోంది.

నెల్లూరు(అర్బన్): నెల్లూరులోని పెద్దాస్పత్రికి నిర్లక్ష్యపు జబ్బు చేసింది. ఇది జిల్లాకే రెఫరల్ ఆస్పత్రి. దీనికి ఆధునిక భవనాలున్నాయి. మంచి ఆపరేషన్ థియేటర్లున్నాయి. స్పెషలిస్ట్ డాక్టర్లున్నారు. అయినా ఉపయోగం లేదు. ఒక మందు ఉంటే మరొకటి ఉండదు. సకాలంలో ఇండెంట్ పెట్టకపోవడం, అత్యవసరమైప్పుడు మందులు లోకల్‌గా కొనుగోలు చేసేందుకు సూపరింటెండెంట్ సంతకాలు పెట్టకపోవడం తదితర కారణాలు రోగులకు శాపంగా మారాయి. దీంతో ఆర్థికంగా భారమైనా బయట డబ్బులు పెట్టి కొనాల్సి వస్తోంది. ఆస్పత్రిలో అత్యవసర రక్తపరీక్షలు సైతం చేయడం లేదనే ఆరోపణలున్నాయి.

కొన్నింటిని పరిశీలిస్తే..

- చెవికి సంబంధించిన డీవాక్స్ చుక్కల మందు అందుబాటులో లేదు.
- సాధారణంగా డాక్టర్లు రాసే యాంటీబయోటిక్స్ మందు సెఫిక్సిమ్ 200 మి.గ్రా మాత్రలు 20 రోజులుగా లేవు.
- షుగర్ (డయాబెటిక్) మందు ఇన్సులిన్‌కు సంబంధించి యాక్ట్రెపిడ్ 30/70 ఉంది. అయితే హ్యూమన్ మిక్స్‌టార్డ్ ఇన్సులిన్ కొన్నినెలలుగా లేదు.
- కొందరు రోగులకు యాంటీబయోటిక్స్ రాస్తారు. అదే సమయంలో వారికి గ్యాస్ట్రిక్ ట్రబుల్‌కు సంబంధించి మందులు తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం పాంటోప్రజోల్ లేకపోవడంతో రానిటిడిన్ (జింటాక్) ఇస్తున్నారు. ఇవి సక్రమంగా పని చేయడం లేదని రోగులు వాపోతున్నారు.
- అమాక్సిలిన్, పొటాషియం క్లావులనేట్ 625 మి.గ్రా యాంటీబయోటిక్స్ రాస్తే కొరత ఉన్నాయంటున్నారు. కానీ కావాల్సిన వారికి మాత్రం ఇస్తున్నారు. మిగిలిన వారికి మరో యాంటీబయోటిక్స్ ఇస్తున్నారు. డాక్టర్లు రాసేవి ఇవ్వడం లేదు.



రక్తపరీక్షల రిపోర్టుల కోసం నిలబడిన రోగులు

మానసిక రోగుల మందులెక్కడ?

పెద్దాస్పత్రిలో సైకియాట్రీ (మానసిక) రోగుల విభాగం ఉంది. అందులో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఎస్ఆర్ డాక్టర్లున్నారు. మానసిక రోగులు క్రమం తప్పకుండా మందులు వాడాలి. లేదంటే ఇబ్బందులు ఎదురవుతాయి. అంతటి ముఖ్యమైన సైకియాట్రీ విభాగంలో దాదాపు మందులు శూన్యం. డాక్టర్లు రాసిచ్చే వాటిని బయట కొనాల్సిన పరిస్థితి ఉంది.

రక్తపరీక్షలదీ అదే దారి

- మందుల కొరత మాత్రమే కాకుండా రక్తపరీక్షలు చేయించుకుందామన్నా కొన్ని రకాలు అందుబాటులో లేవు. ఎంతో ముఖ్యమైనవి సైతం చేయడం లేదు.
- ఎల్ఎఫ్‌టీ (లివర్ ఫంక్షనల్ టెస్ట్) కొంతకాలంగా చేయడం లేదు.
- లిపిడ్ ప్రొఫైల్ (కొలెస్ట్రాల్, ఎల్‌డీఎల్, హెచ్‌డీఎల్, ట్రైగ్లిసరైడ్స్) లాంటి పరీక్షలు చేయడం లేదు.
- యూరిక్ యాసిడ్ రక్తపరీక్ష చేయడం లేదు. థైరాయిడ్ పరీక్షలు కొంత కాలం చేస్తే మరికొంతకాలం అందులో వినియోగించే రియేజంట్స్ లేవంటూ చేయడం లేదు. కొన్ని రకాల రక్తపరీక్షలు బయట ప్రైవేట్ ల్యాబ్‌ల్లో చేయించుకోవాల్సి వస్తోంది.
- ఎంఆర్‌ఐ, సీటీ పరీక్షలు చేయించుకునే వారికి ఇవ్వడానికి ఫిల్మ్‌లు ప్రస్తుతం లేవు. పెద్దాస్పత్రిలో ఒక ఫిల్మ్ కేవలం రూ.200కే ఇస్తారు. పరీక్షలు పూర్తి ఉచితం. అయితే ఫిల్మ్‌లు ఇవ్వనందున రోగులు తమ పరీక్షల ఫొటో వివరాలను డీవీడీ, సీడీ రూపంలో తీసుకుని బయట స్కాన్ సెంటర్లలో ఒక్కో ఫిల్మ్‌కు రూ.500 చెల్లించాల్సి వస్తోంది.

ఎన్ని పడకలున్నాయంటే.. :	750
అవుట్ పేషెంట్లు : సుమారు	1,300 మంది
ఇన్ పేషెంట్లు :	500 నుంచి 550 మంది



తగినన్ని కుర్చీల్లేక కింద కూర్చొన్న రోగులు

వసతులు కల్పిస్తున్నాం

రోగులకు అన్ని వసతులు కల్పిస్తున్నాం. రక్తపరీక్షలు, స్కానింగ్ రూంల వద్ద అదనంగా కుర్చీలు ఏర్పాటు చేస్తాం. రక్తపరీక్షలకు వెళ్లేందుకు లిఫ్ట్‌ను తక్షణమే మరమ్మతులు చేయిస్తున్నాం. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాం. ఒకటీ, అరా లేకుంటేలోకల్‌గా కొనుగోలు చేసి రోగులకు ఇస్తాం. రక్తపరీక్షలు సైతం అన్ని అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నాం.

– డాక్టర్ సిద్ధానాయక్, సూపరింటెండెంట్, పెద్దాస్పత్రి, నెల్లూరు

తగ్గిన సంఖ్య



మరమ్మతులకు గురైన లిఫ్ట్

రెండు నెలల క్రితం వరకు రక్తపరీక్షల గదులు పాత భవనంలో కిందే ఉండేవి. అప్పట్లో 280 మందికి పైగా రోజూ పరీక్షలు చేయించుకునేవారు. ఇప్పుడు కొత్త భవనంలో పైఅంతస్తులో ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. అయితే లిఫ్ట్ పని చేయడం లేదు. ఎప్పుడూ మరమ్మతులకు గురయ్యే ఉంటుంది. కనీసం ర్యాంపు కూడా లేదు. దీంతో వృద్ధులు మెట్లు ఎక్కలేక నరకం అనుభవిస్తున్నారు. పలువురు పరీక్షలు చేయించుకోకుండానే వెళ్లిపోతున్నారు. దీంతో రక్తపరీక్షలు చేయించుకునే వారి సంఖ్య 230కి పడిపోయింది. అలాగే రక్త పరీక్షల వద్ద, స్కానింగ్, ఎక్స్‌రే రూమ్‌ల వద్ద సరిపడా కుర్చీలు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో రోగులు కింద కూర్చొంటున్నారు. కూటమి ప్రభుత్వంలో ఇన్ని సమస్యలు పెద్దాస్పత్రిలో ఉన్నాయి.

చెడు వ్యసనాలకు బానిసై..

- దొంగగా మారిన వ్యక్తి
- తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యం
- అరెస్ట్ చేసి రూ.17 లక్షల సొత్తు స్వాధీనం



మాట్లాడుతున్న రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, చిత్రంలో వేణు, లక్ష్మణరావు

నెల్లూరు సిటీ: చెడువ్యసనాలు, విలాసవంతమైన జీవనానికి అలవాటుపడిన ఓ వ్యక్తి దొంగ అవతారమెత్తాడు. తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరగసాగాడు. అతని కదలికలపై నిఘా ఉంచిన నెల్లూరు రూరల్, సీసీఎస్ పోలీసుల ప్రత్యేక బృందం ఆదివారం అరెస్ట్ చేశాయి. నెల్లూరు రూరల్ పోలీసుస్టేషన్‌లో రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. విడవలూరు మండలం వావిళ్ల గ్రామానికి చెందిన ఎం.సతీష్‌కుమార్ చెడు వ్యసనాలు తీర్చుకునేందుకు సరిపడా నగదు లేకపోవడంతో సులభ మార్గంలో సంపాదించేందుకు గృహాల్లో దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. వచ్చిన నగదుతో జల్సాలు చేయడం ప్రారంభించాడు.

ప్రత్యేక బృందం ఏర్పాటు

కొంతకాలంగా నెల్లూరు రూరల్, నగరం, వెంకటాచలసత్రం, ఇందుకూరుపేట తదితర ప్రాంతాల్లో దొంగతనాలు జరుగుతున్నాయి. దీంతో రూరల్ డీఎస్పీ ఇన్‌స్పెక్టర్ వేణు, సీసీఎస్, స్థానిక సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. చోరీ జరిగిన గృహాల్లో లభ్యమైన ఆధారాలను బట్టి నిందితుడిని సతీష్ కుమార్‌గా గుర్తించి అతడి కోసం గాలింపు చేపట్టారు. ఆదివారం అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు.

ఎక్కడంటే..?

- ఈ ఏడాది జూన్ 15వ తేదీన నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల గ్రామంలో అశోక్‌కుమార్ అనే వ్యక్తి ఆరుబయట నిద్రిస్తుండగా తలదిండు కింద ఉన్న తాళాలను తీసుకుని ఇంట్లోని 12 సవర్ల బంగారు ఆభరణాలు, 100 గ్రాముల వెండి వస్తువులను సతీష్‌కుమార్ చోరీ చేశాడు.
- జూలై 24వ తేదీన ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామంలో చిట్టెమ్మ అనే మహిళ ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని 30 గ్రాముల బంగారు ఆభరణాలు దోచుకెళ్లాడు.
- ఆగస్ట్ 29వ తేదీన వెంకటాచలసత్రం మండలం కసుమూరు గ్రామంలో తిరుపతమ్మ తన కుటుంబంతో ఆరుబయట నిద్రిస్తుండగా ఆమె తలదిండు కింద ఉన్న తాళాలను తీసుకెళ్లి ఇంట్లోని 7 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.1.75 లక్షల నగదును అపహరించాడు.
- ఈనెల 12వ తేదీన ఉమ్మారెడ్డిగుంటకు చెందిన లక్ష్మీప్రసన్న చెన్నైకి వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉంది. ఆమె హ్యాండ్ బ్యాగ్‌లోని 12 సవర్ల బంగారు ఆభరణాలను చోరీ చేశానని సతీష్‌కుమార్ విచారణలో వెల్లడించాడు. దీంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రూ.17 లక్షల విలువ చేసే 35 సవర్ల బంగారు ఆభరణాలు, 100 గ్రాముల వెండి వస్తువులు, మోటార్‌బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగా నిందితుడిపై విడవలూరు పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్టెడ్ షీట్ ఉందని పోలీసులు తెలిపారు.

సిబ్బందికి నగదు ప్రోత్సాహకాలు

నిందితుడిని అరెస్ట్ చేసి చోరీ సొత్తు రాబట్టేందుకు కృషి చేసిన ఇన్‌స్పెక్టర్ జి.వేణు, ఎస్సై లక్ష్మణరావు, సీసీఎస్ ఏఎస్సై జె.వెంకయ్య, రూరల్ హెడ్‌కానిస్టేబుళ్లు ప్రసాద్, పి.ఆదినారాయణ, సీసీఎస్ హెడ్‌కానిస్టేబుళ్లు వారీస్ అహ్మద్, భాస్కర్, కానిస్టేబుళ్లు అల్లాభక్షు, మునికృష్ణ, శ్రీనివాసులు, మహబూబ్‌బాషా, ఎం.శివకుమార్‌ను డీఎస్పీ అభినందించి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

కోలాహలంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలు

- అల్లూరుకు మొదటి బహుమతి



మొదటి బహుమతి అందుకుంటున్న అల్లూరు బీగాల బ్రదర్స్

అల్లూరు: దివంగత కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి జ్ఞాపకార్థం మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలు ఆదివారం అల్లూరులో కోలాహలంగా జరిగాయి. వీటిని వైఎస్సార్‌సీపీ నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, బాలకృష్ణంరాజు ప్రారంభించారు. అల్లూరు బీగాల బ్రదర్స్‌కు చెందిన ఎడ్లు 2.4 కిలోమీటర్ల దూరాన్ని 4.49 నిమిషాల్లో పూర్తి చేసి మొదటి బహుమతి గెలుచుకున్నాయి. ఇస్కపల్లి గ్రామానికి చెందిన పాపానబోయిన జ్యోతిశ్రీ ఎడ్లు రెండో స్థానంలో, గంగపట్నం గ్రామానికి చెందిన చాముండేశ్వరి సీఫుడ్స్ ఎడ్లు మూడో స్థానంలో, ముదివర్తి గ్రామానికి చెందిన ఎడ్లు నాలుగో స్థానంలో, యల్లాయపాళెం గ్రామానికి చెందిన అత్తిరాజుల లాస్య ఎడ్లు ఐదో స్థానంలో నిలిచాయి. ప్రథమ బహుమతి కింద రూ.25,116ను కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ద్వితీయ బహుమతిగా రూ.20,116ను కృష్ణారెడ్డి, తృతీయ బహుమతిగా రూ.15116ను మన్నెమాల నారపరెడ్డి జ్ఞాపకార్థం మన్నెమాల సుకుమార్‌రెడ్డి, నాలుగో బహుమతిగా రూ.10116ను కరేటి బాలు జ్ఞాపకార్థం కరేటి దైవాదీనం, ఐదో బహుమతిగా రూ.7,116ను పప్పు వెంకయ్య జ్ఞాపకార్థం పప్పు శ్రీనయ్య, సుధాకర్, శ్రీహరి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణంరాజు, చెంతాటి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో జట్టులో నెల్లూరీయులు

జే.పంగులూరు: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈనెల 28 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జార్ఖండ్‌లో జరిగే పోటీలకు సబ్ జూనియర్ విభాగంలో ఎంపికలు పూర్తి చేసినట్లు అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి ఆదివారం తెలిపారు. బాపట్ల జిల్లా పంగులూరులో బాలబాలికల జట్లను ఎంపికలు జరిగాయి. వీరికి శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. బాలుర జట్టులో నెల్లూరుకు చెందిన గౌత మ్, బాలికల జట్టులో కె.భవానీ స్థానం దక్కించుకున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.100
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 127	బ్రాయిలర్	
లేయర్ (లైవ్)	: 110	స్కిన్‌లెస్	: 254
బ్రాయిలర్ చికెన్	: 230	లేయర్ చికెన్	: 187

